క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర బుధవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరుగు ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 6 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్-అఫిషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

ఈ నెల 24న జాబ్‌మేళా

నందిగామ టౌన్: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం రాత్రి ఆయన మాట్లాడారు. వాస్తవానికి ఈ జాబ్ మేళా ఈ నెల 18న జరగాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలు జాబ్‌మేళాకు వస్తున్నాయని చెప్పారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు ప్రతిభాపురస్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యుత్తమ పనితీరుతో పాటు నాక్ ఏ గ్రేడ్ సాధించినందుకు కలెక్టర్ ఢిల్లీరావు చేతులమీదుగా ఉత్తమ కళాశాల ప్రతిభాపురస్కారం అందజేశారు. మంగళవారం స్వాతంత్ర్య వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మికి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను అభినందించారు. సమష్టి కృషితోనే కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ ప్రతిభ పురస్కారం అందుకోగలిగామని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి చెప్పారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



వీరులపాడు: విద్యార్థులకు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంతో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో బుధవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టటంతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాలలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయటమే కాకుండా విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా అందుకనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యా బోధన చేయాలని సూచించారు. అంతే కాకుండా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టిన ఆదూరి వెంకటరత్నం, పాల్ కెనడీలను ఘనంగా సత్కరించారు.

ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయండి



నందిగామ: ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలు జయప్రదం చేయాలని డివిజన్ కార్యదర్శి గోపి నాయక్ పిలుపునిచ్చారు. ప్లీనరీ సమావేశాలకు సంబంధించి వాల్ పోస్టర్లను బుధవారం పట్టణంలోని కేవీఆర్ కాలేజీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ 2023 ప్లీనరీ సమావేశాలు ఈనెల 19, 20వ తేదీలలో విజయవాడలో జరుగనున్నాయన్నారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు షేక్ కాజు, హసేన్, రఘు, సందీప్ పాల్గొన్నారు.

పుస్తకాల పూదోట

- హనుమంతరాయ గ్రంథాలయం
- పుస్తక ప్రేమికులకు వరం
- 50 వేలకు పైగా పుస్తకాలు
- గ్రంథాలయానికి 90 సంవత్సరాల చరిత్ర

విజయవాడ కల్చరల్: సమాచార సాంకేతిక విజ్ఞానరంగం విస్తృతమైనా పుస్తకం తన ఉనికిని కోల్పోలేదు. జ్ఞాన కేంద్రాలైన పుస్తకాల్లోనే ప్రపంచం పొదిగి ఉంటుంది. వేల, లక్షల సంవత్సరాల చరిత్ర, సంస్కృతిని, ఇతహాసాలు, పురాణాలను వివరించే గ్రంథాల సమాహారం గ్రంథాలయం. అంతటి ముఖ్యమైన గ్రంథాలయాల్లో నగరంలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం ఒకటి. దీనికి 90 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇది పుస్తకాల పూదోట. దీనికి ఇటీవల అనేక హంగులు సమకూర్చి ఆధునీకీకరించారు.



గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయం

చైతన్యం కలిగించడానికి..

విజయవాడలో 15పైగా గ్రంథాలయాలున్నాయి. వీటిలో ప్రధానమైంది హనుమంతరాయ గ్రంథాలయం. నాడు సమాజంలోని ప్రతి వ్యక్తి విద్య అవసరాన్ని గుర్తించి వారిని సమాజంలో ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్ది, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చైతన్యం కలిగించాల్సిన అవసరమేర్పడింది. దీంతో నగర ప్రముఖుడు స్వాతంత్ర్య సమరయోధుడు వెలిదండ్ల హనుమంతరావు పేరుతో దేశ భక్తులు గెల్లి రాజగోపాలం, కృతివెంటి కుటుంబరావు నండూరి వెంకటేశ్వరరావు ప్రేరణతో 1934 డిసెంబర్ 2వ తేదీన కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు పాతబస్తీ రథం సెంటర్‌లోని ఒక చిన్నగదిలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు.

విలువలు కాపాడుకుంటూ..

పాతబస్తీలోని గ్రంథాలయం ఇరుగ్గా ఉండేది. దీంతో 1944లో దాతల సహకారంతో గాంధీనగర్‌లో 619 చదరపు గజాల్లో సొంత భవనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో హనుమంతరాయ కళావేదిక, మొదటి అంతస్తులో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. దీన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రారంభించారు. నాటినుంచి తన విలువలను కాపాడుకుంటూ వస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రంథాలయాన్ని ఆధునికీకరించి కంప్యూటరైజ్ చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు.

వదాన్యుల సహకారంతో..

సినీ నటులు అక్కినేని నాగేశ్వరరావు, మహానటి సావిత్రి, దాసరి నారాయణరావు తదితరులు గ్రంథాయానికి, కళావేదికకు పూర్తి స్థాయిలో సాయం చేశారు. పఠన మందిరాన్ని మహానటి సావిత్రి, కళావేదికను అక్కినేని నాగేశ్వరరావు, పారిశ్రామిక వేత్త ముప్పవరపు వెంకటేశ్వరరావు పేర్లతో పిలుస్తున్నారు.

గ్రంథాలయం ఆధునికీకరణ

గ్రంథాలయానికి 8 నెలల క్రితం నూతన కమిటీ ఏర్పాటైంది. తర్వాత దీన్ని దాతల సాయంతో.. రూ.25 లక్షలతో ఆధునికీకరించారు. నాలుగునెలలు దీన్ని తెరవలేదు. రెండు నెలలుగా గ్రంథాలయం పని చేస్తోంది. కంప్యూటరైజ్ చేసిన ఈ గ్రంథాలయం అన్ని వసతులతో గురువారం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. గ్రంథాలయంతోపాటు కళావేదికకు కూడా కొత్త హంగులు అమర్చారు.



నృత్య సంబంధిత పుస్తకాలను పరిశీలిస్తున్న నృత్యకళాకారులు(ఫైల్)



గ్రంథాలయంలో లోపల..

సాహిత్య కార్యక్రమాలకు ప్రోత్సాహం

గ్రంథాలయంలో చరిత్ర, పరిశోధన, సాహిత్యం, కథా, నవల, బాల సాహిత్యం, అనువాదం, పోటీ పరీక్షలకు అవసరమైన గ్రంథాలు పలు ఆంగ్ల, తెలుగు దినపత్రికలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. హనుమంతరాయ గ్రంథాలయానికి అనుబంధంగా హనుమంతరాయ కళావేదిక, కళా, సంగీత, సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది.

పూర్తిస్థాయిలో అందుబాటులోకి



1934లో వన్‌టౌన్ రథం సెంటర్‌లో ప్రారంభించారు. తర్వాత గాంధీనగర్‌కు మార్చారు. ఆధునికీకరించి పాఠకులకు పూర్తి స్థాయిలోకి అందుబాటులోకి తీసుకువచ్చాం. త్వరలో నిరుద్యోగుల శిక్షణ తరగతులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

–దోగిపర్తి శంకరరావు, అధ్యక్షుడు, హనుమంతరాయ గ్రంథాలయం

మంచి చేసే వారిని గెలిపించండి



వీరులపాడు: మండలంలోని దాచవరం సర్పంచ్, జమ్మవరం ఎనిమిదో వార్డు ఉప ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, మండల నాయకులు అభ్యర్థులు గద్దె వెంకటేశ్వర్లు, ఇడుపులపాటి కటాక్షంలను గెలిపించాలని కోరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తులకు మద్దతు పలికి ఓట్లేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి సైతం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఉప సర్పంచ్ రామిశెట్టి రత్నప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు తోట హరీష్, తిరుమలరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం

పెద్దమోదుగపల్లి(వత్సవాయి): గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికలలో ప్రచారం ముమ్మరంగా సాగుతుంది. వైఎస్సార్ సీపీ మద్దతు తెలిపిన అభ్యర్థి కల్యాణం విజయలక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని చెబుతున్నారు. ప్రతి పేదవాడి సంక్షేమం ఇంటివద్దకే వస్తుందని గతంలో ఇటువంటి పాలన చూడలేదని ప్రజలు చెబుతున్నారన్నారు. గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

రూ. 20 లక్షలతో డ్రెయిన్‌ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

చందర్లపాడు(నందిగామ టౌన్): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు గ్రామంలో రూ. 20 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ డ్రెయిన్‌ల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు మురుగు నీరు పారుదల కాక ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. దీంతో గడపగడపకు మన ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ. 20 లక్షలతో సీసీ డ్రెయిన్‌లు నిర్మించి మురుగు నీటి పారుదలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్తాల పున్నమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, వేమా సురేష్ బాబు పాల్గొన్నారు.



సీసీ డ్రెయిన్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ప్రజలకు మరింత సేవలందించాలి



విజయవాడ స్పోర్ట్స్: ప్రజలకు విశేష సేవలందించి పోలీస్ ప్రతిష్టను పెంచాలని పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. ఆర్ఎస్ఐ నుంచి ఆర్ఐగా ఉద్యోగోన్నతి పొందిన డి.అర్జునరావు, ఎస్.బ్రహ్మానందం సీపీ రాణాను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు మరింత సేవలందించాలని సీపీ రాణా వారికి సూచించారు.

ప్రజా సేవ చేస్తే తగిన గుర్తింపు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: నీతి, నిజాయితీతో పాటు నిస్వార్థంగా ప్రజా సేవ చేసే అధికారులకు అవార్డులు వాటంతటవే వరిస్తాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వాతంత్ర్య దినోత్సవంలో ఉన్నతాధికారుల నుంచి అవార్డులు పొందిన అధికారులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధికారులకు బదిలీలు, విరమణలు సర్వసాధారణమని ఎక్కడ పని చేసినా ప్రజా మన్ననలు పొందేలా పని చేయాలన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రవీంద్రరావు, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో సీఐ హనీష్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం సీఐగా ఉద్యోగోన్నతి పొందిన ఎస్ఐ సోమేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, నాయకులు పాములపాటి రమేష్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, నల్లమల్లి మురళి, మారం అమరయ్య, బాపట్ల సాంబయ్య, విశ్వనాథపల్లి వాణి, సముద్రాల మధు, వైఎస్ఎన్ ప్రసాద్, షేక్ ఖాలిక్, నెలకుదిటి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్డీవోను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్

ఓటరు వెరిఫికేషన్‌పై సమీక్ష

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటి ఓటర్ సర్వే కార్యక్రమం జరుగుతోందని దానికి అన్ని వర్గాల వారు సహకరించాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమానికి సంబంధించి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో బీఎల్ఓలు ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. అందరి సహకారంతోనే నాణ్యమైన ఓటర్ జాబితా సిద్ధం చేయడం సాధ్యమవుతుందన్నారు. తప్పులు లేని ఓటర్ జాబితా సిద్ధం చేయడమే లక్ష్యంగా సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నరసింహారావు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అవకతవకలు లేని ఓటర్ లిస్టు లక్ష్యం

కంచికచర్ల: ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమానికి గ్రామాల్లోని అన్ని రాజకీయ పార్టీనాయకులు సహకరించాలని తహసీల్దార్ పబ్బారి శంకరబాబు పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి, కీసర, మండల కేంద్రమైన కంచికచర్ల గ్రామాల్లో బుధవారం ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బీఎల్ఓలు చేపట్టారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపడుతున్నాయని అన్నారు. ముఖ్యంగా యువతను గుర్తించి వారికి ఓటు హక్కు కలిగేలా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందరి సహకారంతో నాణ్యమైన మెరుగైన ఓటరు లిస్టును తయారు చేస్తామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలనే తలంపుతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో బీఎల్ఓ జిల్లేపల్లి రత్నాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణా రంగారావు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో



గండేపల్లిలో ఓటరు లిస్టు జాబితాను పరిశీలిస్తున్న బూత్ లెవెల్ అధికారి రత్నాకర్

భర్త అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలప్రాజెక్టు సమీపంలోని గంగానమ్మ గుడి ప్రాంతానికి చెందిన ముత్యాల రజనికుమారి, వెంకట రమణ భార్యభర్తలు. వెంకట రమణ పాల ప్రాజెక్టు పాల వ్యాన్‌లో కలెక్షన్ ఏజెంట్. ఈ నెల 14వ తేదీ డ్యూటీ నుంచి తిరిగి వచ్చిన వెంకట రమణ నగదు బ్యాగ్‌ను భార్యకు ఇచ్చి బుజ్జి అనే వ్యక్తి వస్తాడు... అతనికి ఇవ్వాలని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువులను ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో ఆందోళన చెందిన రజనీకుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సిద్ధమవుతున్న గణనాథులు





వినాయక చవితి పండుగకు గణనాథులు సిద్ధమవుతున్నారు. దీనికి వినాయక విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. గణేశ్ ప్రతిమ మోడల్స్‌ను హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నారు. వీటి మాదిరిగానున్న పరిసర ప్రాంతాల్లో విగ్రహ తయారీదారులు ముస్తాబు చేస్తున్నారు. మట్టితో తయారుచేసే విగ్రహాలు తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయని తయారీదారులు చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్రాధాన్యతాక్రమంలో డ్రెయిన్ల నిర్మాణం

జగ్గయ్యపేట అర్బన్: ప్రాధాన్యతా క్రమంలో అన్ని వార్డుల్లో అవసరమైన చోట్ల డ్రెయిన్లు నిర్మిస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక 10వ వార్డులోని కమలా థియేటర్ వెనుక ప్రాంతంలో రూ. 3 లక్షల వ్యయంతో నిర్మించనున్న 150 మీటర్ల పొడవైన డ్రెయిన్‌కు చైర్మన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారంతో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, కాశీ కిషోర్, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్ పాల్గొన్నారు.



10వ వార్డులో డ్రెయిన్ శంకుస్థాపనలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కంచికచర్ల: ఓ వ్యక్తి కనిపించటం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కంచికచర్ల పట్టణానికి చెందిన పసుపులేటి రాజేష్(37) ఈనెల 14వ తేదీ రాత్రి 7గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పుట్టకతో మూగ, చెవుడు, పోలియో కలిగిన వంగి నడుస్తుంటాడని తెలిపారు. అయితే బంధువులు ఉన్న గ్రామాలలో విచారణ చేపట్టారని జాడ తెలియక పోవటంతో బుధవారం పోలీస్ స్టేషన్‌లో రాజేష్ తండ్రి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయండి

జగ్గయ్యపేట అర్బన్: చలో విజయవాడ పేరుతో సీపీఐ బస్సు యాత్రను నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా డెప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్ తెలిపారు. ఈనెల 24 వ తేదీన జరగనున్న ఈ బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న సీపీఐ కార్యాలయంలో బస్సు యాత్ర వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17న విశాఖపట్నం నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్ర సెప్టెంబర్ 8న తిరుపతి చేరుకుంటుందని, ఆగస్టు 24వ తేదీన ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం చేరుకొని మైలవరం, ఇబ్రహీంపట్నంలలో రోడ్ షోలు నిర్వహించుకుంటూ సాయంత్రం విజయవాడ చేరుకుని అక్కడ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి జె.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ పోతిపాక వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి యండ్రపల్లి భాను పాల్గొన్నారు.



సీపీఐ బస్సు యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు శంకర్